క్లుప్తంగా

అర్జీలను పరిష్కరిస్తాం


అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

కల్లూరు: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన పలువురు ప్రజలు అర్జీలను సమర్పించారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి


పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్

కోడుమూరు రూరల్ : గ్రామాల్లో వివిధ పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గూడూరు ఎంపీడీఓ శివనాగప్రసాద్ పంచాయతీ కార్యాదర్శులను ఆదేశించారు. సోమవారం గూడూరు మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నిర్దేశించిన సమయంలోగా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు.

తాగునీరు అందించాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు : కల్లూరు అర్బన్ కాలనీలో ప్రతి రోజు తాగునీరు అందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో ప్రజా పోరు యాత్ర కార్యక్రమం నిర్వహించారు. నాయకులు రాముడు, సాయిబాబా, యేసు మాట్లాడుతూ కల్లూరు అర్బన్ పరిధిలోని కాలనీలు ఏర్పడి ఏళ్ల గడుస్తున్నా ప్రజలకు రోజూ తాగునీరు అందడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో హుస్సేన్ బాషా, లక్ష్మయ్య, గిడ్డయ్య, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు లిస్టును పకడ్బందీగా రూపొందించాలి


ఓటరు జాబితాపై చర్చిస్తున్న తహసీల్దార్ వెంకటేష్ నాయక్

కోడుమూరు రూరల్: త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను పకడ్బందీగా రూపొందించాలని తహసీల్దార్ వెంకటేష్ నాయక్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా సవరణలపై సమావేశం జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఫైనల్ ఓటరు జాబితాను ఈనెల 13న ప్రదర్శించడం జరుగుతుందని, ఆలోగా ఓటరు జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు, అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. సమావేశంలో డీటీ రామాంజినేయులు, ఎల్ఎల్‌సీ, జీడీపీ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చు


దూదేకుల సంఘం అధ్యక్షుడు జమాల్‌తో సంఘ నాయకులు

గడివేముల: దూదేకుల సంఘం ఐకమత్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చని సంఘం మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ జమాల్ బాషా అన్నారు. సోమవారం మండల కేంద్రమైన గడివేములలోని కొత్త బస్టాండు ప్రాంతంలోని దూదేకుల భవన్ వద్ద సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో దూదేకుల కులస్తులకు ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దూదేకుల కులస్తులు అధికంగా ఉన్న దొంగు ప్రాంతంలో ప్రత్యేక మసీదు కొరకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఇటీవల ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో దూదేకుల సంఘానికి అన్యాయం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో దూదేకు ల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.100 కోట్లు నిధిని ఏర్పాటు చేస్తామని కూటమి హామీ ఇచ్చిందన్నారు. నాయకులు ఆర్మీ జమాల్ బాషా, టీచర్ మాబాషా, యాసిన్ బాషా, సుభాన్, షేక్షావలి పాల్గొన్నారు.

బుగ్గరామేశ్వరా.. మన్నించు!

- కన్నమడకలలో అభివృద్ధికి నోచుకోని బుగ్గరామేశ్వరుని క్షేత్రం
- శిథిలావస్థకు చేరిన కట్టడాలు
- మాన్యం భూములు ఉన్నా కొరవడిన ఆదరణ
- కార్తీక మాసంలోనూ పూజలకు నోచుకోని వైనం



కన్నమడకలబుగ్గలో స్వాముల వారి మూలవిరాట్, బుగ్గరామేశ్వరస్వామి క్షేత్రం

ఓర్వకల్లు : మండలంలోని కన్నమడకల గ్రామ శివారు ప్రాంతంలో వెలసిన పుణ్య క్షేత్రంలో బుగ్గరామేశ్వరస్వామి క్షేత్రం దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఆలయ ప్రహరీ, పుష్కరిణి శిథిలమవ్వడంతో రక్షణ కొరవడింది. గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ఘనలూ లేకపోలేదు. ఆలయ పరిసరాలు సైతం అన్యాక్రాంతమవుతున్నాయని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవదాయ శాఖ అధికారులు స్పందించి, శిథిలావస్థకు చేరిన పురాతన శివాలయాన్ని నిర్మించి, బుగ్గరామేశ్వర స్వామి క్షేత్రాన్ని అభివృద్ధిలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలయ విశిష్టత

మండలంలోని కన్నమడకల గ్రామ శివారు ప్రాంతంలో వెలసిన పుణ్య క్షేత్రంలో బుగ్గరామేశ్వర స్వామి చెంతన పార్వతీదేవి, గుంత మల్లేశ్వర స్వామి, గోవిందరాజులు, కాలభైరవుడు, కాశీ విశ్వేశ్వరుడు, వీరభద్రుడు ఒకే సన్నిధిలో కొలుదీరివున్నారు. ఈ క్షేత్రంలో స్వాముల వారిని దర్శించుకుంటే కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకున్నట్లేనని పెద్దలు చెబుతారు. పూర్వం గ్రామంలోని శివాలయం నుంచి ఈశ్వరుడు కాలినడకన వెళ్లి గ్రామ శివారులో గల ఎత్తైన మర్రి వృక్షాలు, నేరేడు చెట్ల మధ్యన ప్రతిష్టమైనట్లు పూర్వీకుల కథనం. ఆ రోజుల్లో ఈ ప్రాంతంలో ఉద్భవించిన నీటి బుగ్గ ద్వారా వరిపంటలు సస్యశ్యామలంగా పండించేవారట.

కొరవడిన ఆలయ భద్రత

బుగ్గరామేశ్వరస్వామి దేవస్థానంలో పూర్వం నిర్మించిన ప్రహరీ గోడలు శిథిలమైపోవడంతో స్వాముల వారికి రక్షణ కొరవడంది. రక్షణ గోడ లేకపోవడంతో పశుపక్షాదులు, ఆగంతకులు, మందుబాబులు ఆలయంలోకి ప్రవేశించి స్వాముల వారి ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారు. గతంలో కొందరు గుప్తనిధుల కోసమని శివలింగాన్ని పెకలించి తవ్వకాలు జరిపిన సందర్భాలు లేకపోలేదు.

అన్యాక్రాంతమైన పరిసరాలు

బుగ్గరామేశ్వరస్వామి క్షేత్రానికి ప్రహరీ నిర్మించకపోవడంతో ఆలయ పరిసరాలు అన్యాక్రాంతమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో పండుగలు, పర్వదినాలు, శుభకార్యాల సందర్భాలలో ప్రజలు తీవ్రఇబ్బంధులు ఎదుర్కోవాల్సి వస్తోంది. క్షేత్రంలో ప్రత్యేక స్నానపు ఘట్టాలు, బట్టు మార్చుకునే గదులు లేక, మహిళలు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోర్లను అపహరించినా పట్టించుకోరు

పదేళ్ల క్రితం స్థానిక కోనేటిలో నీరు ఇంకిపోవడంతో దేవదాయ శాఖ అధికారులు ఆలయ పరిసరాల్లో మూడు బోర్లు తవ్వించి, విద్యుత్ మోటార్లను అమర్చారు. అయితే బోర్లలో ఇసుక కారణంగా మోటార్లు తుప్పుపట్టి పనిచేయక వదిలేశారు. సదరు బోర్లను గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లినా అధికారులు కనీసం వాటిపై ఆరాతీయకపోవడం విమర్శలకు తావిస్తుంది.


ఆలయానికి 115 ఎకరాల మాన్యం

మండలంలోని కన్నమడకల గ్రామంలో శివాలయం, వేణుగోపాల, ఆంజనేయ స్వామి దేవాలయాలు ప్రధాన పురాతన ఆలయాలు. ఆ రోజుల్లో గ్రామంలోని ఆలయాలల్లో స్వాముల వారి ధూపదీప నైవేద్యాలు, వసతుల కల్పన నిమిత్తం పూర్వీకులు 115 ఎకరాల మాన్యం భూములను కేటాయించారు. ఇందులో శివాలయానికి దాదాపు 50 ఎకరాలు, వేణుగోపాల, ఆంజనేయస్వామికి సుమారు 34 ఎకరాల భూమి వుంది. అంతేగాక ఆలయాలలో పురోహితం చేయడానికి మరో 35 ఎకరాల చొప్పున మాన్యం భూములను కేటాయించారు. సుమారు వంద ఏళ్లనుంచి సదరు భూములను గ్రామస్తులు నామమాత్రం కౌలుకు తీసుకొని అనుభవిస్తూ ఆలయాల అభివృద్ధిని మరుగునపడేశారు. నాలుగు దశాబ్దాల నుంచి ఆలయ భూములను దేవదాయ శాఖలో విలీనం చేయడంతో సదరు భూములకు క్రమేనా ఆధరణ పెరగుతూ వస్తోంది. ఒక్కో దేవస్థానానికి సగటున ఏడాదికి రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు కౌలు వసూలు చేస్తున్నారు. గ్రామ నాయకులకు ఆదాయ వనరులపై వున్న దృష్టి, దేవాలయాల అభివృద్ధిపై పెట్టడం లేదని గ్రామ ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.

ఆలయ అభివృద్ధిపై నిర్లక్ష్యం

బుగ్గరామేశ్వరస్వామికి మాన్యం భూములు వున్నప్పటికీ వాటిపై వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చుపెట్టడంలో అధికారులు ఉదాసీనత చూపుతున్నారు. స్థానిక ఓ భక్తుడు దాతల సహకారంతో స్వాముల వారి గర్భగుడిపై గోపురం నిర్మించారు. గర్భగుడి ముందు భాగంలో స్లాబ్ వేయడానికి నిధులులేక తాత్కాలిక రేకుల షెడ్డును నిర్మించాల్సి వచ్చింది. అలాగే బుగ్గరామేశ్వరస్వాముల వారికి నిత్య పూజలు చేయాల్సిన పురోహితుడు 35 ఎకరాల దేవుడి మాన్యం అనుభవిస్తున్నా, కనీసం కార్తీక మాసంలోనైనా స్వాముల వారికి నిత్య పూజలు చేయడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శిథిలావస్థకు చేరిన పుష్కరణి


శిథిలావస్థకు చేరిన పుష్కరణి

సాధారణంగా ఏశైవ క్షేత్రంలోనైనా శివునికి తూర్పు, ఉత్తరదిశల్లో పుష్కరణులు ఉంటాయి. కానీ ఇక్కడ పడమటి దిశలో పుష్కరణి వుండడంతో శివుని తలపై గంగాదేవి కొలువైనట్లు, పవిత్ర కోనేరుగా భావిస్తారు. ఒకప్పుడు ఇక్కడి కోనేరులో నీరు పుష్కలంగా ప్రవహించేది. కాలక్రమేణా క్షేత్రం పై భాగంలో రైతుల భూముల్లో విచ్చలవిడిగా బోర్లు వేయడంతో కోనేటిలో నీటిధార తగ్గిపోయింది. వేసవిలో ఏకంగా చుక్కనీరు లేకుండా ఇంకిపోతుంది. కాగా, కోనేటికి నిర్మించిన బండరాళ్ల చీలికలు ఇవ్వడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది.

నేడు 'పొలం పిలుస్తోంది'

సి.బెళగల్: మండల పరిధిలోని రెండు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఓ మల్లేష్‌కుమార్ తెలిపారు. ఉదయం కొండాపురం, మధ్యాహ్నం ముడుమాల గ్రామ సచివాలయంలో పిలుస్తోంది కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం క్షేత్ర ప్రదర్శనలో భాగంగా రైతులతో కలిసి పంట పొలాల సందర్శన ఉంటుందన్నారు. ఆయా గ్రామాల రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కోడుమూరు రూరల్ : మండలంలోని రామాపురం గ్రామ శివార్లలో హంద్రీనీవా కాల్వ వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం సిబ్బందితో దాడులు నిర్వహించి ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రూ.40వేలు స్వాధీనం చేసుకోవడంతో పాటు, బోయ కృష్ణ, బాల మద్దిలేటి, జడల మనోహర్, కృష్ణయ్య, మాదన్నలను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మండలంలోని రామాపురం గ్రామ బస్టాప్ వద్ద సోమవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. బైకుపై మద్యం తీసుకెళ్తున్న లద్దగిరి గ్రామానికి చెందిన పరిగెల మాదులును అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ర్యాగింగ్ నివారణపై నేడు సదస్సు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు యాంటీ ర్యాగింగ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు తెలిపారు. వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అతిథులుగా పాల్గొని ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

శైవక్షేత్రాలు కిటకిట

- కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు
- మారుమోగిన శివనామస్మరణ


కాల్వబుగ్గలో స్వామి వారికి పల్లకీ సేవ


భోగేశ్వరాలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


శ్రీపాణికేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


భోగేశ్వరున్ని దర్శించుకునేందుకు వేచియున్న భక్తులు

పాణ్యం : కార్తీక సోమవారం శైవక్షేత్రాలు తెల్లవారుజము నుంచే కిటకిటలాడాయి. శివనామస్మరణతో మారుమోగాయి. ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. మండల కేంద్రమైన పాణ్యంలోని శ్రీ పాణికేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అలాగే శ్రీ భృంగీశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజమున నుంచే ఆలయం ప్రాంగణం కార్తీక దీపాల వెలుగుతో దేదీప్యమానంగా వెలిగింది. ఆగస్తీశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, బిల్వార్చన పూజలు, క్షీరాభిషేకం తదితర పూజలు చేశారు. కొత్తూరులోని శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు వైభవంగా జరిగాయి.

బుగ్గరామేశ్వర క్షేత్రంలో పూజలు

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వర క్షేత్రంలో కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు కళ్లె లక్ష్మీనారాయణ శర్మ, నరసింహశర్మలు బుగ్గరామేశ్వరస్వామి, భ్రమరాంభికాదేవికి సుప్రభాత సేవ, అభిషేకాది పూజలు నిర్వహించారు. అనంతరం రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వాముల వారి గర్భగుడిలో ఆలయ మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ చంద్రపెద్దస్వామి కుటుంబ సభ్యులు పుష్పాలంకరణ చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను గావించి గర్భగుడి చుట్టు ప్రదక్షిణలతో పల్లకీ సేవ నిర్వహించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ కళ్యాణి, స్థానిక ఎస్ఐ సునీల్‌కుమార్ ఆలయానికి చేరుకొని స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భోగేశ్వరంలో కార్తీక సందడి

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరాలయం భక్తులతో కళకళలాడింది. కార్తీకమాసం రెండో సోమవారం కావడంతో వందలాది మంది భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. అభిషేక ప్రియుడైన ఈశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయ ఈఓ రామానుజన్ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ విశిష్టత గురించి ఆలయప్రధాన అర్చకులు శ్యాంసుందరశర్మ భక్తులకు వివరించారు. అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించినట్లు అర్చకులు గిరినాథశర్మ తెలిపారు. అనంతరం గడిగరేవుల గ్రామంలో స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం


మాట్లాడుతున్న ఏపీఎం సుబ్బయ్య

కోడుమూరు రూరల్ : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యమని ఏపీఎం సుబ్బయ్య తెలిపారు. సోమవారం కోడుమూరులోని స్త్రీశక్తి భవన్‌లో పొదుపు సంఘాల మహిళలకు చదువు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఏపీఎం మాట్లాడుతూ మండలంలో 3,700మంది చదువురాని మహిళలున్నారని, వీరందరికి ఉల్లాస్ కార్యక్రమం కింద అక్షరాలు నేర్పేందుకు 370మంది వలంటీర్ టీచర్లను ఎంపిక చేయడం జరిగిందన్నారు. 3 నెలల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాన్ని చదువురాని మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మల్లీశ్వరీ, మండల వయోజన విద్యా పర్యవేక్షకులు ఆదినరసింహా, వీఓఏలు, వలంటరీ టీచర్లు పాల్గొన్నారు.

వయోజనులందరికీ చదువు నేర్పించాలి

సి.బెళగల్: మండలంలోని వయోజనులందరికీ చదువు నేర్పించాలని, ఇందుకోసం మండలంలో ఉల్లాస్ ద్వారా వయోజన విద్యా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వెలుగు ఏపీఎం రామేశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన ఉల్లాస్ మండల కో ఆర్డినేటర్ జాకీర్‌హుసేన్‌తో కలిసి స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో మహిళలకు మండల స్థాయి రెండవ విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో శిక్షకులు చేపట్టాల్సిన అంశాలను ఏపీఎం తెలియజేశారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు రాముడు, మాదులు, శ్రీనివాసులు, గుండమయ్య తదితరులు ఉన్నారు.

15న కార్తీక లక్ష దీపోత్సవం

కర్నూలు కల్చరల్: కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఈనెల 15వ తేదీన లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు సమితి కార్యాధ్యక్షులు ఇ.పద్మావతి తెలిపారు. సోమవారం సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దీపోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. స్థానిక వినాయక్ ఘాట్ కేసీ కెనాల్‌లో సామూహికంగా కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 15న సాయంత్రం 4 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 5 గంటలకు సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి వినాయక్ ఘాట్ వరకు శివపార్వతుల రథోత్సవం, రాత్రి 7.30 జ్వాలా తోరణం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

రేపటి నుంచి క్రీడాపోటీలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చిల్డ్రన్స్ డే పురస్కరించుకొని ఈ నెల 13, 14 తేదీల్లో అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాండ్‌బాల్, త్రోబాల్, వాలీబాల్, రైఫిల్ షూటింగ్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని వెల్లడించారు.

మహిళల చదువుతోనే సమాజ అభివృద్ధి


మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి


ఓర్వకల్లు : మహిళల చదువుతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక పొదుపు భవనంలో నిర్వహించిన రెండవ బ్యాచ్ వలంటీర్ ఉపాధ్యాల శిక్షణ కార్యక్రమానికి ఎంపీడీఓతో పాటు, ఎంఈఓ-2 ఓంకార్ యాదవ్, వయోజన విద్య నంద్యాల జిల్లా నోడల్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ×ఉల్లాస్◊ కార్యక్రమం ద్వారా పొదుపు సంఘాల మహిళలకు చదువుకునే అవకాశం లభించడం హర్షించదగ్గ విషయమన్నారు. పొదుపు సంఘాలల్లోని నిరక్షరాసులను అక్షరాసులుగా తీర్చిదిద్దాలనేది కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటరామిరెడ్డి, వెలుగు సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

హామీలకు కట్టుబడి ఉండాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు నాగన్న

ఓర్వకల్లు : ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి పనిచేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన ప్రజాపోరు యాత్ర రెండవ రోజు మండలంలోని బైరాపురం, లొద్దిపల్లె, ఓర్వకల్లు గ్రామాలలో కొనసాగింది. నాగన్న మాట్లాడుతూ.. ప్రధానంగా బైరాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో దళితులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అనంతరం గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేసి, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ నెల 14న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు మధుసూదన్, సుధాకర్, రామస్వామి, బైరాపురం కృష్ణుడు, శేఖర్, శాలీబాషా తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు ముగ్గురు మాత్రమే హాజరు


పీజీఆర్ఎస్‌కు హాజరైన అధికారులు

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంపై మండల అధికారుల నిర్లక్ష్యపు ధోరణి కొనసాగుతూనే ఉంది. మండల అధికారులు ప్రజా సమస్యలను తెలుసుకోవడం, వాటిని పరిష్కరించడంపై ఆసక్తి కనరపడం లేదని మండల ప్రజలు ప్రతివారం మండిపడుతున్నా, అధికారులు తీరుమాత్రం మారడం లేదు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. అయితే కార్యక్రమానికి మండల అధికారులందరూ హాజరు కావాల్సి ఉండగా, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డితోపాటు మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోసేనాయక్‌లు మాత్రమే హాజరు అయ్యారు. కార్యక్రమంకు ముగ్గురు అధికారులు మాత్రమే హాజరు కావడంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా, గైర్హాజరు అయిన అధికారులు ఎవ్వరూ తనకు సమాచారం ఇవ్వలేదన్నారు. ఇదిలా ఉండగా ఎంపీడీఓ రాణెమ్మ, ఏపీఓ రామన్న ఇద్దరు మాత్రమే మండల పరిషత్ కార్యాలయంలో కార్యక్రమానికి హాజరైనట్లు తెలిసింది. కాగా కార్యక్రమానికి కేవలం ఇద్దరు, ముగ్గురు అధికారుల మాత్రమే హాజరువుతున్నా జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మండల అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

ఉచితంగా డప్పు కొట్టకపోతే పింఛన్ తీసేస్తారట


ఎంపీడీఓ రఘునాథ్‌కు వినతి పత్రం అందజేస్తున్న డప్పు కళాకారుల సంఘం నాయకులు

కర్నూలు(రూరల్): ఎదురూరు, జి.సింగావరం గ్రామ సచివాలయం సిబ్బంది గ్రామంలో డప్పు ఉచితంగా కొట్టకపోతే పింఛన్ తీసేస్తామంటూ డప్పు కళాకారులను బెదిరిస్తున్నారని, ఇది ఎంత వరకు న్యాయం అని డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్ ప్రశ్నించారు. సోమవారం నగరంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డప్పు కళాకారులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దళితులంటే చులకనగా చూస్తున్నారన్నారు. నిరక్ష్యరాస్యుల పట్ల ప్రభుత్వ ఉద్యోగులు ఇలాగే ప్రవర్తించేదని ప్రశ్నించారు. ఇలాంటి వారిపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కర్నూలు ఎంపీడీఓ రఘునాథ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మద్దిలేట్టి, బజారి, నాగరాజు, జయరాములు, మారన్న తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలతో ఇబ్బందులు


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పాణ్యం : మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ రెసిడెన్షియల్ బాలిక పాఠశాల చుట్టూ వెలసిన షాప్‌ల వలన విద్యార్థినులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజా సంఘాల నాయకులు సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ రోజురోజుకు షాపులు పెరుగుతూ పాఠశాల ప్రధాన గేట్ వరకు వచ్చేశాయన్నారు. అంతేకాక ప్రభుత్వ నిషేధిత వస్తువులైన బీడీలు, సిగరేట్లు, గుట్కా, ఇతర వస్తువులను వాటిలో విక్రయిస్తున్నారన్నారు. రాత్రి వేళలలో మద్యం సేవించి పాఠశాల ఆవరణలోకి సీసాలు పడేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు వెంకటాద్రి, సీపీఐ నాయకులు చెన్నయ్య, రవి, వేణు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలకు నోటీసులు

పాఠశాల చుట్టు ఉన్న దుకాణాలకు మరో మారు నోటీసులను జారీ చేసినట్లు సోమవారం ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మొదటిసారి ఇచ్చిన నోటీసులకు సరైన స్పందన లేకపోవడంతో మరో మారు అందించినట్లు చెప్పారు. దుకాణాల యజమానులు స్పందించకుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం తొలగిస్తామని హెచ్చరించారు. మొత్తం 22మందికి నోటీసులు జారీ చేశామన్నారు.

పార్కింగ్ స్థలానికి వేలం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని స్థానిక గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో వాహనాల పార్కింగ్‌కు సంబంధించి సోమవారం సాయంత్రం నగరపాలక న్యూ కౌన్సిల్ హాలులో బహిరంగ వేలం నిర్వహించారు. పలువురు ఈ వేలంలో పాల్గొన్నారు. అత్యధికంగా పాట పాడి కే.మధు అనే వ్యక్తి రూ.5.6 లక్షలకు పార్కింగ్ స్థలాన్ని దక్కించుకున్నారు.